# చేసిన అపరాధమేమిటో!

శ్రీ కిళాంబి కృష్ణమాచార్య, బి. ఏ.

ఒకప్పుడు అతడూ మంచిదినాలు చూచినవాడే. కాని ఓడలు బండ్లు, బండ్లు ఓడలుగా మారుతోంటాయి. పదిహేను ఏండ్లకుర్రాడప్పుడు ప్రమాదవశాత్తు బండి క్రిందపడ్డాడు. పాపం రెండుకాళ్ళు నలిగిపోయాయి. ఇదే ప్రారంభము అతని హీనదశకు. అప్పటినుంచి రెండు కర్రలను ఆధారముగా నుంచుకొని శరీరాన్ని ఒకచోట నుండి మరొక చోటికి జేరేస్తుండేవాడు. రోజూ అన్నం అడుక్కోవడం, అది ఏరోడ్డు పక్కనో పెట్టుకొని తిని కాసిని నీళ్ళుత్రాగి ఏచెట్టు క్రిందో పడుండేవాడు. దొరకని రోజున అతని కర్మ మంతే. అట్లాంటప్పుడు నిస్సహాయుడై ఏ దారి ప్రక్కనో పడుండేవాడు. ఏ మహారాజైనా కనికరించి పట్టెడు మెతుకులు పెడితే కద్దు లేకపోతే అంతే.

ఆ పల్లెటూరిలోనే తన జీవితమును గడుపుచుండే వాడు. ఆఖరుకు నివసించటానికి చిన్న గుడిసైనా లేదు. "నా" అన్నవాళ్ళు అంతకంటే లేరు. ఆ సమయానికి ఏ చెట్టుక్రింద వుంటే అక్కడే పడివుండే వాడు. ఇతడంటే ఆ వూళ్లో ప్రతివారికి తెలుసు, ఇరవై ఏండ్ల పాటు ప్రతినిత్యము ఇతని ముఖము చూచుటవలన ఆ వూళ్ళో ప్రతివారి హృదయములో కరుణ బదులు అసహ్యత జనిస్తూ వుండేది. భూతలములో అతను ఎరుగున్న ప్రదేశాలేవీ లేవు. ఆమూడు నాల్గు పల్లెటూళ్ళే పట్టుకొని వేళ్ళాడే వాడు- ఏమైనా తినుటకు దొరికినా సరే దొరకక పోయినా సరే.

ఆ కనపడే చెట్ల అవతల ఏమున్నదో గూడ అతనికి తెలియదు. కూపస్థ మండూకమువలె తన జీవితాన్ని గడుపుతుండేవాడు. ఆ దారిన పోయే సంసారులంతా "ఇంకో వూరికి పోరాదుటరా ఎప్పుడూ మమ్మల్నే పీక్కు తినక పోతే" అనే వాళ్ళు. కాని అతడు తిరుగు జవాబు చెప్పకుండా భయం భయముగా జరిగిపోతుండే వాడు. అతనికి పోలీసులంటే ఎందుకో అపరిమిత భయము. రోడ్డు చివర వారిని చూచుట తోడనే పొదల చాటుకు చేరి బల్లపఱుపుగా నేలమీద పడుండి, వారు దాటి పోగానే వళ్ళు దులుపుకొని రోడ్డుమీదకు వచ్చేవాడు.

అతడు గర్భ దరిద్రుడు. వేసవి కాలమందు ఏరోడ్డు ప్రక్కనో రాత్రిళ్ళు పడుకొనేవాడు. కాని చలి కాలమునందు ఎవరికి కనుపడకుండా ఏగొడ్ల చావడిలోనో దూరి కునుకుతూండేవాడు. పొలములయందు పనిచేసెడి గొడ్లవలె తన జీవితాన్ని గడిపే వాడు. వాటికి కడుపునిండా మేతయైనా వుంటుంది కాని ఈ నిర్భాగ్యునకు అదీ కరవే. అతడు ఇన్ని దినముల నుండి మానవుల మధ్య నివసించుచున్నను ఎవ్వరినీ ఎరుగడు. అతనిని చూచి అసహ్యించుకొనువారు తప్ప ప్రియముగా ఒక్కమాట పలుకువారు లేరు. అతడు చేసిన అపరాధమేమిటో? దారిద్ర్యమేనా?

* * *

ఒక్క ముద్దయినా తిని రెండురోజులయింది. ఎవ్వరు ఏమి ఇచ్చునట్లు లేదు. అతనిని ఎవ్వరు చూచినను దూరమునుండియే "మళ్ళా వచ్చావూ మొన్ననేగా మాయింటికి వచ్చావు" అని చీదరించుకునే వాళ్ళు.

"ఈ సోమరి పోతును సంవత్సరము పొడుగునా ఎవరు మేపగలరు" అని కొందరనే వాళ్ళు.

ఆ చుట్టుప్రక్కల గల మూడు వూళ్లూ తిరిగాడు. గాని ప్రతి చోటంతే. ఆ వూరి యందు గల ప్రతి హేయమగు జంతువుగూడ పొట్టబోసికొన నల్గుచున్నది గాని, ఒక్క మానవుడు తోటి మానవుల మధ్య నివసించుచూ పట్టెడు అన్నమును సంపాదించుకొనలేక మలమల మాడిపోవుచున్నాడు! ఇంకొక్క వూరుమాత్రం మిగిలింది. దానిని చేరటానికి ఐదు మైళ్ళ దూరము పోవాలి. ఒక్క అడుగు పోవుటకైనను శక్తి చాలలేదు. పొట్ట వెన్ను నంటుకొని యున్నది. కాని బయలుదేరక తప్పలేదు.

అది డిసెంబరు నెల. ఆకాశం అంతా శ్యామల వర్ణములగు మేఘ సముదాయముతో అలముకొని పకృతినంతా భయంకరముగా నుండునట్లు చేస్తోంది. చీకటులు నలుదెసల కమ్ముకుంటున్నాయి. మేఘ గర్జనల వల్ల దృశ్యము మరింత భయానకముగ ఉన్నది. చీకటులు నలుదెసల క్రమ్ముకుంటున్నాయి. వర్షము తుంపరగా పడుతోంది. ఆ కుంటివాడు మెల్లిగా కర్రలను జరుపుకొనుచు మధ్యమధ్య పెడదిరిగిన కాలిపై దేహభారమును మోపుకొనుచు పట్టెడు మెతుకుల కొరకు యాత్ర సాగించాడు. ఆ క్షణమందు అతనిని బాధించుచున్న దొక్కటియే—క్షుద్బాధ. ఆకలిబాధ తీరిన వెనుక ప్రాణము నైనను నర్పించుటకు సిద్ధుడేమో! కాని తిండి దొరుకుటెట్లు?

దారిలో వర్షము క్షోణీపాతంగా కురిసింది. ఆ కుంటివాడు తడిసి ముద్దయైపోయాడు. చలిగాలి ఎముకలను సహితము కొరుక్కు దినునట్లు తీవ్రంగావీస్తోంది. రక్తము గడ్డకట్టికొని పోవునట్లుండెను వర్షమువల్ల దారి అంతయు బురదతో నిండుకుంది. అందువల్ల ఆధారముగావున్న కర్రలు బురదలో ఇరుక్కుపోయి ప్రయాణాన్ని మరింత కష్టతరంగా చేసినవి. ఇల్లామూడు గంటలసేపు ప్రయాణాన్ని సాగించాడు. దూరంగా మినుకుమినుకు మనుచున్న ఆ యూరిదీపాలను చూచుటతోడనే కొంత దుఃఖోపశమనము కల్గింది. తన గమ్యస్థానమును చేరాముగదా అని సంతోషపడ్డాడు. దహించి వేయుచున్న ఆకటిబాధ తీరబోవుచున్నదని అతని మనస్సు ఉవ్విళ్లూరింది.

ఊరిబయట కనబడిన మొదటి వ్యక్తిని ధర్మమడిగాడు.

"మళ్లా ఇక్కడకూడా తయారయ్యావూ" అని చురచుర చూస్తూ ఆవ్యక్తి వెళ్ళిపోయాడు. కుంటివాడు ఆవూళ్ళో ప్రతియిల్లు తిరిగాడు. ప్రతి వ్యక్తిని అడిగాడు మానవ హృదయ సీమయందు దయాదాక్షిణ్యములు హరించిపోయినట్లు అప్పుడు గ్రహించాడు. ఆకలి బాధచేత గిలగిలా తన్నుకున్నాడు. మనిషి నిలువలేక తూలిపోసాగాడు. మెల్లగా ఊరిబయట చేరాడు. అతనక్కడ పడిపోయాడు. ఇట్లా ఎన్నిగంటలు బాధననుభవించాడో అతనికి తెలియలేదు. కొంతసేపటికి సొమ్మసిలి శోషచెందాడు.

* * *

తెల్లవార వచ్చింది. పక్షి గణములన్నీ ఆకుంటివాని బాధను చూడలేక అరుచుకుంటూ వృక్షాగ్రముల నుండి లేచిపోతున్నాయి. బాలభానుడు తన లేత కిరణాలచేత లోకాన్నంతా రంజింప చేస్తున్నాడు. కుంటివాడు కొంచెము తెప్పిరిల్లాడు. కళ్లుతెరిచి చూచాడు. లేవటానికి ప్రయత్నించాడు. కాని లేవలేకపోయాడు శరీరమంతా మట్టితో నిండివుంది. తోటిమానవులవలె రక్త మాంసాదులతోడనే జన్మించినను, తానట్టి ఇడుమలు పడుటకు కారణమెవ్వరో అతనికి బోధపడలేదు. విశ్వమంతయు ధనధాన్యములచే తులతూగుచు సర్వసౌఖ్యముల ననుభవించుచుండ, తానట్లు బురదయందు మట్టి పురుగువలె పొర్లాడుచు ఆకటిబాధచే దహించుకొని పోవుటకు కారణమేదియో ఆలోచించ సాగాడు.

అతని క్రోధాగ్ని లోకాన్నంతా దహించునట్లుగా ఉగ్ర రూపందాల్చింది. కాని ప్రయోజనం? ప్రస్తుతము అతన్ని బాధిస్తుం దొక్కటియే: అది కుద్బాధ. మెలికలు తిరిగిపోతున్నాడు బాధకు తాళలేక.

* * *

కర్షకజనులు తమ పొలాలకు పోతున్నారు- దారి ప్రక్కన బురదమయమై పడియున్న మానవశరీరమును చూచిగూడ. ఒక్క గంట కాలం గడిచింది. హీనస్వరంలో దీనంగా తన చేతుల్తో వెన్నుకంటుకుపోయిన కుక్షినిచూపి ప్రార్థించాడు. కాని శిలాహృదయములు కరుగు టెక్కడ? ఎక్కడికిని కదలలేకపోయాడు. అట్లే ఇంకొక్క గంటకాలము పడున్నచో చావు నిక్కవమని ధృవపఱచుకొన్నాడు. శూన్యాకాశం వంక చూస్తూఅట్లే పడున్నాడు.

నిరాశచెందాడు. దగ్గరలోనున్న కఠినశిలపై తలను బాదుకొని ఆత్మహత్య గావించుకో దలచుకొన్నాడు. ఇంతలో పదివత్సరముల బాలుడు పొలానికి అన్నంమూట పట్టి కెళ్ళుతున్నాడు. ఆశతో ఆమూట వంకచూసాడు. ఒక్క ఆలోచన అతని మనస్సుకు తట్టింది. అట్టి స్తితియందు అత డేపనిచేసినను తప్పు లేదని గ్రహించాడు. చేయటానికిగూడ వెనుదీయ లేదు. దగ్గరనున్న కత్తెరరాయిని కుర్రాడివైపు విసిరాడు. కుర్రాడు గిర్రునతిరిగి క్రిందపడ్డాడు. ఆభిక్షుకుడు అన్నం మూట దగ్గరకు జరుగ ప్రయత్నించాడు. మూట ఆత్రుతతో విప్పుతున్నాడు. అంతే ఫెడీలుమని ఒక్క దెబ్బనెత్తిన పడింది. రక్తం వరదలై పారసాగింది. ఇంతలో రైతులంతా చేరారు. వాళ్ళంతా మళ్ళా కొట్టారు. కొట్టడంతోటి విసుగు జనించగనే, గుడిసెలో అతనిని తాళమువేసి పోలీసుకొరకు పరుగెత్తారు.

అరగంటకల్లా నల్గురు పోలీసులు హాజరు. తలుపులు తెరిచిచూచారు. కుంటివానిశవము నేలపై పడుంది. అంతా నివ్వెర పోయారు.


## తేళ్ళ పాలిట యముడు?

ఔను

ఒకే ఒక ప్రయోగము

దానితో బాధ మాయము కావలసినదే.




## తేలు మందు

(రిజిష్టర్డ ట్రేడ్ మార్కు)

మందు పడినతోడనే విషము పారిపోవును!

ఏడ్పుతో వచ్చువారు నవ్వుతూ పోవలయును!

మనదేశములో ఈమందు ప్రతి యింటిలోను ముఖ్యముగా ఉండి తీరవలయును. ఇది ఆంగ్ల, యూనాని, ద్రవిడ, ఆంధ్ర వయిద్య నిపుణులవలన మెప్పుదల పొంది యున్నది. యెన్ని దినములు నిలువయుంచినను ఈ మందుయొక్క గుణము మారదు. తేలు, మండ్రగప్ప, జెఱ్ఱి, పాము, ఎలుక, ఇంక యితర విషజంతువుల విషములను రెండు నిముషములలో పూర్తిగా నివారణ జేయును.

ప్యాకెట్టు 1-కి 0-8-0. తపాలాజర్చు 0-5-0.

ఒకేసారి 3 ప్యాకెట్లు కొనువారికి
తపాలాఖర్చుతో సహా 1-8-0.

12 ప్యాకెట్లు కొనువారికి
తపాలాఖర్చుతో సహా 5-0-0.

ధనలక్ష్మి అండు కో.,

నెం. 6, లాయరు చిన్నతంబి మొదలి వీధి,
సౌకారుపేట, మదరాసు.